

ఆకాశంలో అద్భుతం

ఆకాశంలో అద్భుతం చోటుచేసుకుంది. సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం రాత్రి గం.9.56 నుంచి అర్ధరాత్రి గం.1.30 వరకు సంభవించింది. గ్రహణ దృశ్యాలను జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

అటవీ శాఖ ఉద్యోగాలకు స్క్రీనింగ్ టెస్టు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

ఒంగోలు వన్‌టౌన్: అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టుల్లో నియామకాలకుగాను ఆదివారం స్క్రీనింగ్ టెస్టు నిర్వహించారు. ఒంగోలు నగరం, సమీప ప్రాంతాల్లో నిర్వహించిన దాదాపు 10 పరీక్ష కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి బీ చిన ఓబులేసు ఆదివారం పరిశీలించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసిన 7052 మందికి గాను 5642 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు చేసిన 1153 మందికి గాను 901 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన పరీక్షలను, ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహించారు. డీఆర్‌ఓతో పాటు ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పీ మధుసూదనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్

ఒంగోలు సబర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ హాలులో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. మీ కోసం డాట్ ఏపీ డాట్ జీటీవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని, అనంతరం వాటి స్టేటస్ తెలుసుకునేందుకు 1100 నంబర్‌కి కాల్ చేయవచ్చన్నారు.



డీఈఓ కార్యాలయంలో.. అవినీతి పాఠాలు..

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ కార్యాలయం అవినీతికి కేంద్రంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు విద్యాశాఖకు చెడ్డపేరు తెస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన అధికారి కట్టుతప్పి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటంతో పాటు తమను చులకనగా చూస్తున్నారని కిందిస్థాయి సిబ్బంది వాపోతున్నారు.

- ఇక్కడ ఫైళ్లు కదలాలంటే చేతులు తడపాల్సిందే
- ప్రైవేటు స్కూళ్ల రెన్యువల్ సమయంలో భారీగా వసూళ్లు
- ఉద్యోగులను వేధిస్తున్నారంటూ అధికారిపై ఆరోపణలు
- అధికారి వేధింపులు భరించలేమంటున్న సిబ్బంది
- దీర్ఘకాలిక సెలవులకు సిద్ధమవుతున్న వైనం

ఒంగోలు సిటీ:

పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు ఉన్నాయా? ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు చెబుతున్నారా? డివిజన్, మండల విద్యాశాఖ అధికారుల పనితీరు ఎలా ఉంది.. ఇలా అన్ని విభాగాల పనితీరును పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ కార్యాలయం క్రమశిక్షణ తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు 3107 ఉన్నాయి. వీటిల్లో 2,98,842 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ కార్యాలయానికి ఏదైనా సమాచారం కోసం వెళితే సరైన సమాధానం రాక అవస్థలు పడాల్సి వస్తోందని తరుచూ ఆరోపణలు వస్తున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి సైతం అవస్థలు తప్పడం లేదు. కార్యాలయంలోని ఓ అధికారి సంతకాల కోసం వెళ్లిన సిబ్బంది గంటల తరబడి వేచి ఉండాల్సిందే. చాలా సందర్భాల్లో ఆఫీసు సమయం ముగిసినా రాత్రి 8:30 వరకూ ఉంచి వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫైళ్లపై సంతకాల కోసం తాను రెగ్యులర్‌గా పనిచేసే కార్యాలయం కాకుండా పక్కనే ఉన్న కార్యాలయానికి రమ్మంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారి తీరుతో మహిళా సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారని విమర్శలున్నాయి.

ప్రతి పనికో రేటు..

మామూలుగా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు జిల్లాలో ప్రతి సంవత్సరం కొత్త పాఠశాలల ఏర్పాటుకు పర్మిషన్, రెన్యువల్స్ కోసం కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడ స్కూలు, పనిని బట్టి వసూలు చేస్తున్నార్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. చిన్న చిన్న ప్రైవేటు స్కూళ్లకు రూ.40 నుంచి రూ.50 వేలు, కార్పొరేట్ స్కూల్‌కు రూ.80 నుంచి రూ.90 వేల దాకా వసూలు చేస్తున్నారని కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో సైతం అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు పాటించలేదని, అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన గుట్టుచప్పుడు కాకుండా రీకౌన్సెలింగ్ నిర్వహించినట్టు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా మెడికల్, స్పౌజ్ బదిలీల్లో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారని తెలిసింది.''నా వెనుక రాజకీయ పెద్దలు ఉన్నారు నాకేం భయం లేదు'' అని ఆ అధికారి చెప్పే తీరు చూస్తే, అవినీతి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది.

దీర్ఘకాలిక సెలవులే శరణ్యం..

ఈ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు అధికారి వేధింపులు భరించే కంటే దీర్ఘకాలిక సెలవులు పెట్టుకోవాలని సిబ్బంది చూస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయ పనివేళల్లో మహిళా ఉద్యోగులను సైతం ఇబ్బంది పెడుతున్నార్న ఆరోపణలు ఉన్నాయి. సమయం అయిపోయిన తర్వాత కూడా నిబంధనలకు విరుద్ధంగా మహిళా ఉద్యోగులను పక్కనే ఉన్న మరో కార్యాలయానికి రప్పించి అక్కడ రాత్రి 9 గంటల వరకు పనిచేయిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే తమను మరింత వేధించే ప్రమాదముందని వారు మిన్నకుండిపోతున్నారు.

ఆది నుంచి ఇదే ఆరోపణలు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సదరు అధికారి గతంలో పనిచేసిన ప్రాంతాల్లో సైతం ఇదే ధోరణి అవలంబించేవారని తెలిసింది. గతంలో కూడా మహిళా ఉద్యోగులు వేధింపులకు గురిచేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయి. అలాగే సదరు అధికారి డైట్ కళాశాలలో పనిచేసినప్పుడు విద్యార్థినులను వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఒంగోలుకు బదిలీపై వచ్చినా ఆ అధికారి ప్రవర్తనలో ఏలాంటి మార్పురాలేదని ఆ కార్యాలయ సిబ్బందే ఆరోపిస్తుండడం గమనార్హం. కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై డీఈఓ ఎ.కిరణ్ కుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బోధన సామర్థ్యాలు పెంచుకోవాలి

ఒంగోలు సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా టీచర్స్ తమ బోధనా సామర్థ్యాలను పెంచుకొని విద్యార్థులకు నైపుణ్యం, నైతికతతో కూడిన విద్యను అందజేసి వారిని ఉన్నత శిఖరాలకు చేరుకొనేలా మీ బోధన కొనసాగాలని డీఈఓ ఏ.కిరణ్‌కుమార్ అన్నారు. ఒంగోలు ఎన్‌టీఆర్ కళా క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు కాలపరీక్షకు తట్టుకొని నిలబడాలని తాము బోధించే విద్య ద్వారా సమాజ స్థితిగతులను మార్చగలుగుతారన్నారు. రాబోవు కాలంలో కృత్రిమమేధ ద్వారా విద్యాబోధన జరిగే అవకాశం ఉందని దానికి తగిన విధంగా ఉపాధ్యాయులు తమ సామర్థ్యలను మెరుగుపరచుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన అపుస్మా జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు మాట్లాడుతూ అపుస్మా యూనియన్ ప్రతిసంవత్సరం క్రమం తప్పకుండా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి సన్మానం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా జోన్-3 ప్రెసిడెంట్ ఏ.వి.సుబ్బారావు, ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఆవుల వెంకటరమణారెడ్డి, జిల్లాలోని అన్ని నియోజకవర్గ అధ్యక్షులు, 100 మందికి పైగా కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

చంద్రబాబు కళ్లు తెరిపించేందుకే

‘అన్నదాత పోరు’



అన్నదాత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ప్రభుత్వం చేతిలో ఉండాల్సిన యూరియా ప్రైవేటు వ్యక్తుల దగ్గరకు ఎలా వెళ్లింది
- ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రుల మాటలు దుర్మార్గం
- అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి మేరుగు, బత్తుల, రవిబాబు

ఒంగోలు టౌన్: రైతుల సమస్యలను పరిష్కరించలేక చేతులెత్తేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అసలు వ్యవసాయం ఎందుకు చేయాలని చెబుతుంటే, ఎరువుల కోసం క్యూలో నిలబడితే తప్పేముంది..భోజనాల కోసం నిలబడడం లేదా అంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు రైతులతో వేళాకోళాలాడుతున్నారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. రైతు సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపించేందుకు ఈ నెల 9వ తేదీ ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్లి వినతి పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని తెలిపారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ జిల్లా పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ‘అన్నదాత పోరు’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారని, పంటలు కొనే నాథుడులేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎరువులు కొనాలంటే మాత్రం అధికధరలు వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. రైతులు ఎరువులు దొరక్క అగచాట్లు పడుతుంటే కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. రైతు సమస్యల మీద రోడ్డుక్కితే లాఠీలతో జవాబు చెప్పాలని, కేసుల పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. మార్క్‌ఫెడ్ ద్వారా 50 శాతం ఎరువులను అందించాల్సి ఉండగా ప్రైవేటు వ్యక్తుల చేతికి చేరిందని, దీనికి కూటమి పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర సాయంతో సంబంధం లేకుండా రూ.20 వేలు అదనంగా అందిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కేవలం రూ.5 వేలు రైతుల చేతిలో పెట్టి ఒట్టి చేతులు చూపుతున్నారని ఎద్దేవా చేశారు.

ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి పాలనలో రైతులు దగా పడ్డారని చెప్పారు. రాష్ట్రంలో పొగాకు, శనగ, మిర్చి, ధాన్యంకు గిట్టుబాటు ధరలు లేవని, ఉల్లి పంటను రైతులే పారవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు అడిగితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల గురించి మాట్లాడితే తోకలు కట్ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపులకు దిగుతున్నారని, ఇలా బెదిరించి పాలన ఎన్నాళ్లు చేస్తారని ప్రశ్నించారు. కూటమి పాలకులకు యూరియా ఎరువులను అందుబాటులో ఉంచడం చేతకావడం లేదని విమర్శించారు.

జిల్లా పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా అన్నీ డివిజన్లలో ఆర్డీఓలకు వినతి పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. నేడు ఆరోగ్యశ్రీని రద్దు చేసి బీమాను తీసుకొస్తున్నారని, మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేదలకు స్పెషాలిటీ వైద్యసేవలు అందకుండా కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణా రెడ్డి, వై వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నకరికంటి శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మద్దిపాడు ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావిపాటి విల్సన్, సంతనూతలపాడు, ఎన్‌జీపాడు మండల పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు కంకణాల సురేష్, దుంపా యలమందారెడ్డి, సటారు జనార్ధన రెడ్డి, కిరీటి, మలిశెట్టి దేవా, శ్రీకాంత్ వేముల తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల మీద చేయిపడితే సహించం

- గణేష్ భక్తుల మీద దాడిని అడ్డుకునే క్రమంలోనే తోపులాట
- నిమజ్జనాన్ని ఆపివేసి పార్టీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- కార్యకర్తలను పరామర్శించడానికి వెళ్లినందుకు మాపై కేసులు పెడతారా
- న్యాయవాదులన్న గౌరవం కూడా లేకపోతే ఎలా
- పోలీసులే స్వయంగా నిబంధనలు ఉల్లంఘించడం దారుణం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



వినాయక ఊరేగింపును అడ్డుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: పార్టీ కార్యకర్తల మీద పోలీసులు చేయివేస్తే సహించేది లేదని, కార్యకర్తల కోసం ఎందాకైనా వెడతానని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు స్పష్టం చేశారు. అవసరమైతే తనపై ఎన్నికేసులు పెట్టినా పర్వాలేదుకానీ, పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదన్నారు. వినాయక నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టు సమాచారం తెలుసుకొని డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన కొత్తపట్నం బస్టాండులో మీడియాతో మాట్లాడారు. 45వ డివిజన్ శ్రీనగర్ కాలనీకి చెందిన ప్రజలు వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహిస్తుంటే పోలీసులు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారని తెలిపారు. కొత్తపట్నంలో నిమజ్జనం చేయడానికి ఊరేగింపుగా బయలు దేరిన వాహనంపై ఏర్పాటు చేసిన డీజేని పగులగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారని తెలిపారు. డీజేని పగులగొట్టకుండా అడ్డుకున్న మహిళలు, పిల్లలపై పోలీసులు దాడి చేశారని ఆరోపించారు. నిమజ్జనాన్ని వేమిరెడ్డి విక్రమ్ రెడ్డి, సతీష్, సిద్దార్థ రెడ్డితో పాటుగా విగ్రహాన్ని దానం చేసిన వెంకటరెడ్డి (దేవుడు), ఆయన కుమారుడు కార్తిక్ రెడ్డిలను అరెస్టు చేశారని చెప్పారు. సమాచారం తెలుసుకున్న వెంటనే వారిని పరామర్శించడానికి తాలుకా పోలీసు స్టేషన్‌కు వెళ్లి చూస్తే అక్కడ వారు లేరని చెప్పారు. అక్రమంగా అరెస్టు చేసిన పార్టీ కార్యకర్తలు ఎక్కడున్నారో తెలుసుకుందామని డీఎస్పీ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. తాము అక్కడున్నప్పుడే పార్టీ కార్యకర్తలను పోలీసు వ్యానులో తీసుకొచ్చారని తెలిపారు. పార్టీ కార్యకర్తలను పరామర్శించడానికి వెళ్లిన తనతో పాటుగా లీగల్‌సెల్ న్యాయవాదులతో దురుసుగా ప్రవర్తించారని, న్యాయవాదులతో మాట్లాడిన తీరు దుర్మార్గమని చెప్పారు. న్యాయవాదులను దూషించడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. పోలీసు కస్టడీలో ఉన్న పార్టీ కార్యకర్తలను పరామర్శించడం నేరం కాదుకదా అని ప్రశ్నించారు. పోలీసు కస్టడీలో ఉన్న వారిని బలవంతంగా తీసుకొనిపోలేను కదా అని నిలదీశారు. పార్టీ కార్యకర్తలను కొట్టడానికే డీఎస్పీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారని అందరూ చెబుతున్నారని, కార్యకర్తలపై పెట్టిన కేసు వివరాలను అడిగి తెలుసుకునే హక్కు తమకుందని స్పష్టం చేశారు. దానికి బదులుగా పరామర్శించడానికి వచ్చిన తమ మీదనే కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, పార్టీ సీనియర్ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, రవీంద్రా రెడ్డి, మహిళా నాయకులు భూమిరెడ్డి రమణమ్మ, వడ్లమూడి వాణి, టి.మాధవి, గోనెల మేరి, తాతా నరసింహ గౌడ్, కిరీటి, కరుణాకర్, డివిజన్ అధ్యక్షులు దేవా, శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీలపై కూటమి చిన్నచూపు

- ముస్లింలకు ఇచ్చిన హామీలు విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- 11 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు అందని గౌరవ వేతనం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 400కు పైగా ఇమామ్, మౌజన్‌లు
- మూలన పడిన సంక్షేమ పథకాలు
- నేడు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇవ్వనున్న వైఎస్సార్ సీపీ మైనారిటీ నేతలు



కంభం పట్టణంలోని జామియా మసీదు

కంభం: ముస్లిం మైనారిటీల ఓట్లు రాబట్టుకునేందుకు ఎన్నో హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం మైనారిటీల ఓట్లతో గద్దెనెక్కిన అనంతరం వారిని విస్మరించడంపై రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మసీదుల్లో నమాజ్ చదివించేందుకు ఇమామ్, అజాన్ ఇవ్వడం, మసీదు బాగోగులు చూసుకునేందుకు మౌజన్ ఉంటారు. ముస్లింల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గతంలో రూ.5 వేలుగా ఉన్న ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు, రూ.3 వేలుగా ఉన్న మౌజన్ ల గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచారు. మౌజన్, ఇమామ్‌లు మసీదులే జీవనాధారంగా వారికి వచ్చే గౌరవ వేతనం పైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్ లకు సుమారు 11 నెలలుగా జీతాల నిధులు విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు మైనారిటీలకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఫిబ్రవరి నెలలో ఒకసారి మాత్రమే ఇమామ్‌లు, మౌజన్‌లకు సంబంధించిన జీతాలు విడుదల చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన సుమారు 400కు పైగా మసీదుల్లో ఇమామ్‌లు, మౌజన్ లు విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా పలు మసీదులకు సంబంధించి ఇమామ్‌లు, మౌజన్‌లు గౌరవ వేతనాల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు దుల్హన్ పథకం, వడ్డీలేని రుణాలు, పెన్షన్‌ల ఊసే లేదని మైనారిటీలు వాపోతున్నారు.

ముస్లింల డిమాండ్‌లు ఇవీ..

50 ఏళ్ల వయస్సు ఉన్న మైనారిటీలకు పెన్షన్, ఈద్గాలు, ఖబరస్తాన్‌లకు స్థలాల మంజూరు, హజ్ హౌస్ ఏర్పాటు, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనంతో పాటు మసీదుల నిర్వహణకు ఆర్థిక సాయం, దుల్హన్ పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయాలని ముస్లింలు డిమాండ్ చేస్తున్నారు.

మైనారిటీలకు అండగా వైఎస్సార్ సీపీ:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ముస్లిం, మైనారిటీలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచకపోవడంపై గళమెత్తేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాయత్తమైంది. అందులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ లకు వినతి పత్రాలు అందజేసే కారక్రమం చేపట్టనున్నారు.

చందాలపైనే ఆధారపడాల్సి వస్తోంది



మసీదుల్లో నమాజు చదివించే ఇమామ్, మసీదు బాగోగులు చూసుకునే మౌజన్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన గౌరవ వేతనం నెల నెలా రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. చందాలతో వారికి కొంత మేర వేతనాలు ఇస్తున్నాం.

– సయ్యద్ ఖాసిం, మహబూబియా మసీదు కమిటీ అధ్యక్షుడు, కంభం

ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి



ఎన్నికలకు ముందు మైనారిటీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. దుల్హన్ పథకం, వడ్డీలేని రుణాలు, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ లు అందించి మైనారిటీల అభివృద్ధికి సహకరించాలి. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజన్ ల వేతనాలు వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గఫార్ అలిఖాన్, వైఎస్సార్ సీపీ స్టేట్ మైనారిటీ సెల్ సెక్రటరీ

కష్టతరంగా మారిన మసీదుల నిర్వహణ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్ లకు సంబంధించి 11 నెలలుగా గౌరవ వేతనాలు, మసీదుల అభివృద్ధికి నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో మసీదుల నిర్వహణ భారంగా మారింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరి నెలలో ఒకసారి మాత్రమే జీతాల నిధులు విడుదల చేసింది. రావాల్సిన 11 నెలల గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే మసీదుల నిర్వహణ మరింత కష్టతరంగా మారుతోంది.

– సుల్తాన్, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు

గుండ్లకమ్మ రిజర్వాయర్లో దూకి యువకుడు మృతి

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఆదివారం ఉదయం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన పుట్టా రాఘవరావు (40) దూకి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు చక్రవర్తి ఫిర్యాదు మేరకు మద్దిపాడు ఎస్సై జి.వెంకట సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దిగి పశువుల కాపరి మృతి



మృతిచెందిన సుబ్బయ్య

త్రిపురాంతకం: పశువులను చెరువులో నుంచి బయటకు తోలేందుకు నీటిలోకి దిగి పూడికలో ఇరుక్కుపోయి పశువుల కాపరి సుబ్బయ్య (49) మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం మేడపి అన్నగారిచెరువు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో విషాదం అలముకుంది. స్థానిక ఎస్‌ఐ శివబసవరాజు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో చిన్నారుల సత్తా



బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో సత్తాచాటిన చిన్నారులు

ఒంగోలు: ఇంటర్నేషనల్ తైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ చిన్నారులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు పెద్ద ఎత్తున హాజరైన చిన్నారులు సత్తా చాటి వివిధ రకాల బెల్ట్‌లను కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో రుత్విక్ కృష్ణ, రోహిత్, షాదాబ్, శివ సూర్యప్రకాష్, జితేష్‌రెడ్డి, ముస్తఫా, లోహిత్, షియాబ్, మోహిత్ రెడ్ బెల్టులు, హేమంత్ నాగసాయి బ్లాక్ బెల్టు కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో రవితరణి, సహస్ర రెడ్ బెల్టులు, సాదియా అన్‌జుం, యశస్వి ఎల్లో బెల్టులు సాధించారు. ఎగ్జామినర్‌గా మాస్టర్ షేక్ కరిముల్లా వ్యవహరించగా, చిన్నారులను జాతీయ తైక్వాండో మాస్టర్ బీవీ రమణయ్య, షేక్ ఖలీఫాతుల్లా బాషా అభినందించారు. కార్యక్రమాన్ని బ్లాక్ బెల్ట్ 2వ డాన్ షేక్ ఆరిఫ్, బ్లాక్ బెల్ట్ ఒకటో డాన్‌లు షేక్ షబ్బీర్, అభిషేక్, విఘ్నేష్ పర్యవేక్షించారు.

క్రికెట్ అండర్-14 బాలుర జిల్లా జట్టు ఎంపిక



ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, తదితరులు

ఒంగోలు: క్రికెట్ అండర్-14 బాలుర జిల్లా జట్టును ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డులోని ఏసీఏ సబ్ సెంటర్ నెట్స్‌లో ఎంపిక చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 90 మందికిపైగా క్రీడాకారులు హాజరవగా, వారి నైపుణ్యాలను పరీక్షించి 39 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి మాజీ క్రీడాకారుడు సీహెచ్ విజయ్‌కుమార్ పరిశీలించారు. ప్రాథమికంగా ఎంపికైన 39 మందికి బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో పలు మ్యాచ్‌లు నిర్వహించి బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్, ఫీల్డింగ్ అంశాలలో నైపుణ్యాలను పరిశీలించిన అనంతరం తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. తుది జట్టుకు ఎంపికైన 16 మంది అక్టోబరు నెలలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, నల్లూరి రవి, ఉండవల్లి రాము, నాదెండ్ల శ్రీను, కొప్పోలు సుధాకర్, లెఫ్ట్ శ్రీను, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి వృద్ధుడు మృతి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రమాదవశాత్తు ముసి వాగులో పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...జరుగుమల్లి మండలం పాలేటిపాడు పంచాయతీ పీఎంవీ కండ్రిక గ్రామానికి చెందిన వెంకటేష్ ఈ నెల 5న ఇంటి పందిరి కర్రల కోసం వాగు అవతలకు వెళుతున్నానని సోదరుడు వెంకట్రావుకు చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో వెంకటేష్ మద్యం మత్తులో ఉన్నాడు. అయితే ఆ తరువాత నుంచి వెంకటేష్ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం వాగు వెంబడి వెతికినా ప్రయోజనం లేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వాగు ఒడ్డున మృతదేహం ఉందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూడగా వెంకటేష్ మృతదేహంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని ఎండ్లూరి డొంక వద్ద గల జిల్లా మహిళా కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 15 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.